అకాల వర్షం.. రైతులు ఆగం

- తడిసిన వరి ధాన్యం
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- టార్పాలిన్‌లు ఇవ్వని ఏఎంసీ అధికారులు



బిచ్కుందలో తడిసిన వడ్లను చూపిస్తున్న రైతు

బిచ్కుంద(జుక్కల్): ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని వర్షం నుంచి కాపాడుకోవడానికి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం వర్షం పడటంతో బిచ్కుంద మార్కెట్ యార్డులో ఆరబెట్టిన వరి ధాన్యం కుప్పలు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. ధాన్యం చేతికి వచ్చిన తర్వాత తడిసి పోవడంతో లబోదిబోమంటున్నారు. కొనుగోలు నిర్వాహకులు తేమ 15 శాతం ఉండాలని నిబంధనలు పెట్టడంతో ఇబ్బందులు పడుతున్నారు. రైతుల సమస్యలు చూడాల్సిన అధికార యంత్రాంగం ఎన్నికల హడావిడిలో ఉండటంతో రైతుల వైపు చూడడంలేదు. రైస్ మిల్లర్లు, ప్రభుత్వ కొనుగోలు నిర్వాహకులు నిబంధనలు పెట్టడంతో ధాన్యం కుప్పల వద్ద కాపలా కాస్తూ ఇబ్బందులు పడుతున్నారు. 4 రోజుల నుంచి వాతావరణంలో మార్పులు వచ్చాయి.. తుఫానుతో వర్షం వస్తుందని సమాచారం ఉన్నా అధికారులు ధాన్యం కొనుగోలు చేయడంలో జాప్యం చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ యార్డులో ధాన్యం ఆరబెట్టి 20 రోజులు అవుతుంది.. అయినా అధికారుల నుంచి స్పందన లేదు. మార్కెట్ కమిటీ అధికారులు ధాన్యం తడవకుండా టార్పాలిన్‌లు ఇవ్వడం లేదు.. చినిగిపోయిన పట్టాలు ఒకరిద్దరికి మాత్రమే ఇచ్చారని రైతులు అంటున్నారు. అధికారులు నిబంధనలు తొలగించి ధాన్యం కొనుగోలు చేయాలని, మార్కెట్ యార్డులో టార్పాలిన్లు, కరెంటు సౌకర్యం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

గాంధారి పరిధిలో..



ధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షానికి రైతులు ఆగమయ్యారు. కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో రైతులు ధాన్యం ఆరబోయగా.. వర్షానికి తడిసి ముద్దయింది. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సరిపడా టార్పాలిన్ కవర్లు లేకపోవడంతో రైతులు ఇబ్బందుతు పడుతున్నారు.

లింగంపేట పరిధిలో..



ధాన్యం కాపాడుకోవడానికి అవస్థలు పడుతున్న మహిళా రైతు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రైతులు ఆగమయ్యారు. చేతికొచ్చిన పంట కొనుగోలు కేంద్రాలకు తరలించి ఆరబెట్టగా అకాల వర్షం పడి రైతులను ఆయోమయానికి గురిచేసింది. లింగంపేట, లింగంపల్లి(ఖుర్దు), ముస్తాపూర్, ఒంటర్‌పల్లి, సురాయిపల్లి, అయిలాపూర్, మెంగారం తదితర గ్రామాల్లో వర్షం పడడంతో ధాన్యం తడిసి ముద్దయింది. రేపో మాపో తూకం వేసి రైస్‌మిల్లుకు తరలించే క్రమంలో వరుణ దేవుడు రైతులను ఆగం చేశాడు. చేతికందిన ధాన్యం నీటిపాలు కావడంతో ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షానికి వరద నీటిలో ధాన్యం కొట్టుకుపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు కాంటాల సంఖ్య పెంచి తొందరగా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

'నేతల హామీతో ఎన్నికల్లో పోటీ చేయడం లేదు'



భిక్కనూరు: తాత ముత్తాతల కాలం నుంచి తమ భూములకు పాసు పుస్తకాలు రాకపోవడంతో సీఎం కేసీఆర్‌పై పోటీ చేయాలని నిర్ణయించుకున్న తాము బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల స్పష్టమైన హామీతో తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నట్లు తిప్పాపూర్ రైతులు చెప్పారు. బుధవారం రైతులు కుంట లింగారెడ్డి, నాగార్తి విఠల్‌రెడ్డి, కొండ సిద్దరాములు, బ్రహ్మచారి, తదితరులు విలేకరులతో మాట్లాడుతూ..పాసుపుస్తకాలు రాకపోవడంతో 67 మందిమి కామారెడ్డిలో పోటీ చేయాలని నిర్ణయించుకుని ప్రకటన చేశామన్నారు. ఈ విషయమై బీఆర్ఎస్ నేత కొమ్ముల తిర్మల్‌రెడ్డి, కాంగ్రెస్ నేత షబ్బీర్‌అలీలు అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లో పాసు పుస్తకాలను జారీ చేయిస్తామని హామీ ఇవ్వడంతో తామందరం తమ నిర్ణయాన్ని వెనక్కితీసుకున్నామన్నారు.

'కామారెడ్డిలో పోటీ నుంచి తప్పకుంటున్నా'



కామారెడ్డి టౌన్: కామారెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ నుంచి తాను తప్పుకుంటున్నానని వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలం సుధాకర్ తెలిపారు. పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా షర్మిలను కలిశానన్నారు.

ఓటు హక్కుపై చైతన్యం కల్పించాలి



కామారెడ్డి అర్బన్: విద్యార్థులు తమ ఇళ్లల్లో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు ఓటు హక్కుపై చైతన్యం కల్పించాలని ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(ఐఎస్ఆర్‌డీ) సంస్థ ప్రధాన కార్యదర్శి అమృత రాజేందర్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రెయిన్ బో ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాముఖ్యతను తెలియజేసే కార్యక్రమం నిర్వహించారు. ప్రతినిధులు రవళి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన తాడ్వాయి క్రీడాకారులు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు వాలీబాల్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో ఆడేందుకు ఎంపికైనట్లు గ్రామ పెద్దలు తెలిపారు. తాడ్వాయికి చెందిన సమీర్‌ఖాన్, మండలంలోని బ్రహ్మాజీవాడికి చెందిన శ్రీకర్ యాదవ్‌లు ఎస్‌జీఎఫ్‌-19 విభాగంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొన్నారన్నారు. ప్రతిభను కనబరచడంతో న్యాయ నిర్ణేతలు రాష్ట్రస్థాయిలో ఆడేందుకు వారిద్దరిని ఎంపిక చేశారన్నారు. సిద్దిపేటలో త్వరలో జరిగేబోయే 67వ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొంటారన్నారు. పీఈటీ బాలు, సర్పంచ్ సంజీవులు, వైస్‌ఎంపీపీ నర్సిములు, వీడీసీ చైర్మన్ రాజు తదితరులు వారిని అభినందించారు.

బి-ఫాం అందుకున్న తోట లక్ష్మీకాంత రావు



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తోట లక్ష్మీకాంతరావు బుధవారం సీడబ్ల్యూసీ సభ్యులు దామోదర్ రాజనర్సింహ, ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చేతుల మీదుగా బి-పాం అందుకున్నారు. తనపై నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ టికెట్టు ఇచ్చిన కాంగ్రెస్ పెద్దలకు ఎళ్ల వేళలా రుణపడి ఉంటానని తోట లక్ష్మీకాంత రావు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

విద్యార్థులకు సృజనాత్మక విద్యను అందించాలి

- డీఈవో రాజు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రాజు

కామారెడ్డి రూరల్: విద్యార్థులకు సృజనాత్మక విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖధికారి రాజు సూచించారు. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్(బాలుర)లో బుధవారం జరిగిన తెలుగు సబ్జెక్టు సముదాయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సి-గ్రేడ్‌లో ఉన్న పిల్లల్ని బి-గ్రేడ్‌కి తీసుకురావాలన్నారు. అంతేకాకుండా హైస్కూళ్లలో ఈవెనింగ్ క్లాసులను ప్రారంభించాలని ఆదేశించారు. ఎంఈవో ఎల్లయ్య, హెచ్‌ఎం సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

బీబీపేట: బీఆర్ఎస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యుడు తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి అన్నారు. బుధవారం శివారు రాంరెడ్డిపల్లిలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తేనే కామారెడ్డి పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందని అన్నారు. గెలుపే లక్ష్యంగా ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త పని చేయాలని సూచించారు. జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల మాయమాటలు నమ్మొద్దు



బీఆర్ఎస్‌లో చేరుతున్న దేవునిపల్లి గ్రామస్తులు

మాచారెడ్డి: ప్రతి పక్ష పార్టీ నేతల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు అన్నారు. బుధవారం పాల్వంచ మండలం మంథని దేవునిపల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు, మహిళలు లోయపల్లి సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డిలో కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కేసీఆర్ గెలిస్తేనే కామారెడ్డి నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. అనంతరం గజ్యానాయక్ తండా చౌరస్తాలో ఇంటింటి ప్రచారం చేశారు.

బీజేపీలో పలువురి చేరిక



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి, లింగంపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు బుధవారం ఎల్లారెడ్డి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి సుభాష్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. లింగంపేట మండలంలోని పర్మల్ల, ఎల్లారెడ్డిలోని మత్తమాల గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులకు పార్టీ కండువాలు కప్పి ఆయన బీజేపీలోకి ఆహ్వానించారు.

కేసీఆర్ నామినేషన్‌కు భారీగా తరలిరావాలి

దోమకొండ: సీఎం కేసీఆర్ గురువారం కామారెడ్డిలో నామినేషన్ సందర్భంగా ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో తరలిరావాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంద్ర మధుసూదన్‌రావు కోరారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కేసీఆర్ నామినేషన్‌కు లక్ష మంది ప్రజలు తరలిరానున్నారని పేర్కొన్నారు. జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుంచాల శేఖర్, సింగిల్ విండో చైర్మన్ పన్యాల నాగరాజ్‌రెడ్డి, ఉపసర్పంచ్ గజవాడ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

మాక్ పోలింగ్



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మోడల్ స్కూల్‌లో బుధవారం ఉపాధ్యాయులు ఇంటర్ విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. మాక్ పోలింగ్‌లో భాగంగా విద్యార్థులకు ఓటు హక్కు వినియోగం, నాయకుడిని ఎన్నుకునే విధానంపై అవగాహన కల్పించారు. పీవో, ఏపీవోలు ఎన్నికల విధుల కార్యక్రమం నిర్వహించగా, విద్యార్థులు ఓటు వేసి నాయకుడిని ఎన్నుకున్నారు. ప్రిన్సిపల్ సాయిబాబా, ఉపాధ్యాయులు శశిశంకర్, నాగరాజు, అంజిలప్ప, స్రవంతి తదితరులున్నారు.

స్త్రీనిధి రుణాలు సకాలంలో చెల్లించాలి

రాజంపేట: బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలను మహిళా సంఘ సభ్యులు సకాలంలో చెల్లించాలని మండల మహిళా సమాఖ్య కోశాధికారి లావణ్య కోరారు. బుధవారం అన్నారంలో గ్రామ సంఘం కట్టని సంఘ సభ్యుల దగ్గరికి వెళ్లి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని సంఘ సభ్యులను సూచించారు. ఇప్పటి వరకు రూ.28 వేలను సంఘ సభ్యులు కట్టించినట్లు పేర్కొన్నారు. గ్రామ సంఘం అధ్యక్షులు సవిత, మండల సబ్ కమిటీ సభ్యులు శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

గోసంగిల సంక్షేమానికి కృషి చేసే వారికే మద్దతు



కామారెడ్డి టౌన్: గోసంగిల సంక్షేమానికి, తమ సమస్యల పరిష్కారానికి కృషి చేసే వారికే తమ మద్దతు ఉంటుందని గోసంగిల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం రాజేష్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డిలో ఇద్దరు సీఎం అభ్యర్థులు పోటీ చేస్తున్నా.. వారికి చిత్తశుద్ధి లేదన్నారు. న్యాయమైన తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు కల్లెం సత్యం, ప్రధాన కార్యదర్శి పోచయ్య తదితరులున్నారు.

ప్రజల ఆకాంక్షల మేరకు బీఆర్ఎస్ మేనిఫెస్టో

- బాన్సువాడ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్ రెడ్డి



ప్రచారం నిర్వహిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉందని బాన్సువాడ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం హాజీపూర్, సంగం, అంకోల్ తండా, అంకోల్, అంకోల్ క్యాంపు, నాచుపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంకోల్ క్యాంపు నుంచి హాజీపూర్ వరకు రూ.12 కోట్లతో రోడ్డు నిర్మాణం చేశామని, 1996లో రూ.2.70 కోట్లతో హాజీపూర్ పెద్ద చెరువు రైతుల అవసరానికి నిర్మాణం చేశానని గుర్తు చేశారు. అంతే కాకుండా రూ.150 కోట్లతో నిజాంసాగర్ కాలువను ఆధునీకరణ చేశామని, అలాగే రూ.150 కోట్లతో మంజీరా నదిపై నాలుగు చెక్ డ్యాములు నిర్మిస్తున్నామని అన్నారు. ఇలా గత 5 ఏళ్లలో ప్రజలకు అవసరమైనవన్నీ చేశామని, అందరూ మంచి మనసుతో ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్, సర్పంచ్‌లు అరిగె అంజయ్య, విజయలక్ష్మి, విజయ,సాయిలు, బద్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలను తాకట్టు పెట్టారు

- మాదిగ సంక్షేమ సమితి రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు మేరి కుమారి



నిరసన తెలుపుతున్న మేరి కుమారి

బాన్సువాడ: రాష్ట్రంలో ఉన్న మాదిగలను ఎమ్మార్పీఎస్ నాయకులు మంద కృష్ణ మాదిగ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వద్ద తాకట్టు పెట్టారని మాదిగల సంక్షేమ సమితి రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు ఉప్పు మేరి కుమారి ఆరోపించారు. బుధవారం బాన్సువాడ పట్టణంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆమె నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగ సంక్షేమ సమితి జాతీయ వ్యవస్థాపకులు మన్నెపల్లి బాబు మాదిగ ఆదేశాను సారం బాన్సువాడలో నిరసన చేపట్టినట్లు తెలిపారు. 2014లో తిరుపతి సభలో మాదిగలు తమకు మద్దతు ఇస్తే 100 రోజుల్లో వర్గీకరణ బిల్లు పెడతామని ప్రకటించి నరేంద్రమోదీ మాదిగలను మోసం చేశారని అన్నారు. మోసం చేసిన బీజేపీకే మళ్లీ ఈ ఎన్నికల్లో మందకృష్ణ మాదిగ వత్తాసు పలుకుతున్నారని ప్రశ్నించారు.

ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక



తాడ్వాయిలో ఎమ్మెల్యే జాజాల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నేతలు

లింగంపేట/తాడ్వాయి(ఎల్లారెడ్డి): లింగంపేట మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు, తాడ్వాయి మండలం దేవాయిపల్లి, సంగోజివాడి, నందివాడ, కన్కల్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బుధవారం ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే జాజాల, బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జాజాల సురేందర్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి భారీ సంఖ్యలో ఇతర పార్టీ నుంచి యువకులు, నాయకులు ప్రతిరోజు వచ్చి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. స్థానికంగా ఉండి ప్రజలకు సేవలు చేసే తనను తిరిగి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

సీఎం సభ కోసం స్థలం పరిశీలన

ఎల్లారెడ్డి: తెలంగాణలో సీఎం కేసీఆర్ మూడో మారు గెలిచి హ్యాట్రిక్ సీఎంగా దక్షిణాదిలో చరిత్ర సృష్టిస్తారని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిలో సీఎం బహిరంగ సభ నిర్వహించే స్థలాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 15న ఎల్లారెడ్డిలో నిర్వహించే సీఎం కేసీఆర్ సభకు అధిక సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే జనార్దన్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, తదితరులున్నారు.

రేవంత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

- మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి

దోమకొండ: కామారెడ్డి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించాలన్నారు. సీఎం కేసీఆర్ ప్రజలకు గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో రూ.కోట్లు కొల్లగొట్టారన్నారు. పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల ప్రాణాలు తీశారన్నారు. రేవంత్‌రెడ్డి నామినేషన్‌కు లక్ష మందితో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 10న నామినేషన్‌కు తరలిరావాలని కోరారు. ఈసందర్భంగా అంబారిపేట గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ నేతల మాటలు నమ్మి ఆగం కావొద్దు

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ కొమ్ముల తిర్మల్‌రెడ్డి



భిక్కనూరులో మాట్లాడుతున్న తిర్మల్‌రెడ్డి

భిక్కనూరు: ప్రజలకు మాయ మాటలు చెప్పి ఎన్నికల్లో గట్టెక్కాలని బీజేపీ, కాంగ్రెస్ నేతలు కుట్రలు పన్నుతున్నారని వీరి మాటలను నమ్మి ఆగం కావద్దని రాష్ట్ర ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ కొమ్ముల తిర్మల్‌రెడ్డి అన్నారు. బుధవారం భిక్కనూరు మండల కేంద్రంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్‌తో కల్సి విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్‌కు మొదటి నుంచి కామారెడ్డి ప్రాంతంపై అభిమానం ఉందని, ఈ ప్రాంతంతో ఆయనకు ఎంతో అనుబంధం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ కూలి పని కూడా కామారెడ్డిలో చేశారని గుర్తు చేశారు. కామారెడ్డి ప్రాంతాన్ని వేగవంతంగా అభివృద్ధి చేసేందుకే కేసీఆర్ ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నారన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి ఈ ప్రాంతంతో ఎలాంటి సంబంధం లేదన్నారు. బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి కులసంఘాల పేరిట చిచ్చుపెడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో ఎంపీపీ గాలిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఇంజినీరింగ్ విద్యార్థికి ఆర్థిక సాయం



బీబీపేట: మండల కేంద్రానికి చెందిన భరత్ అనే ఇంజినీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్నారు. విద్యార్థి కుటుంబ పరిస్థితి బాగాలేక పోవడంతో ఆయన చదువు నిమిత్తం బుధవారం తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డి రూ.30 వేల ఆర్థిక సహాయం అందించారు. కళాశాల ఫీజు చెల్లించలేని పరిస్థితి ఉండడంతో సుభాష్‌రెడ్డి ఆర్థిక సహాయాన్ని అందిస్తూ ఇతర అవసరాలకు కూడా తోడ్పాటు అందిస్తానని విద్యార్థికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మట్ట శ్రీనివాస్, సైదుగారి అశోక్ గౌడ్, సుమన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపి క్యాంపు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి భవిత కార్యాలయంలో బుధవారం ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. అంగవైకల్యం గల చిన్నారులకు ఫిజియోథెరపి వైద్యులు అరుణ్ వైద్య పరీక్షలు చేశారు. ప్రతి రోజు ఫిజియోథెరపికి సంబంధించిన వ్యాయామాలు చేయడం వల్ల అంగవైకల్యం దూరమవుతుందన్నారు. కార్యక్రమంలో భవిత సిబ్బంది వెంకటేశం, శివకుమార్ తదితరులున్నారు.

ఉండమ్మా బొట్టు పెడతా..



మాచారెడ్డి: ఉండమ్మా బొట్టు పెడతా అంటూ బీఆర్ఎస్ మహిళా విభాగం నాయకులు బుధవారం గజ్యానాయక్ తండా చౌరస్తాలో మహిళలకు బొట్టు పెడుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంక్షేమ సమితి సభ్యురాలు సుమలతశర్మ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రస్తుతం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు మరిన్ని పథకాలు అమలు కావాలంటే బీఆర్ఎస్‌కు ఓటేయాలని అన్నారు. కేసీఆర్ మరోసారి సీఎం అయితే గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల తరహాలో కామారెడ్డి నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని అన్నారు. గురువారం కేసీఆర్ నామినేషన్ కార్యక్రమానికి అధిక సఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా నేతలు లావణ్య, పద్మ, శారద, చంద్రకళ, సుధాకర్ శర్మ, తదితరులు ఉన్నారు.